ఎన్నికల్లో ప్రలోభాలకు లొంగొద్దు



ఓటు హక్కు వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు



ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేస్తున్న మహిళా సంఘాల నేతలు

స్వీప్ నోడల్ అధికారి శరత్‌చంద్ర

మణికొండ: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధమని ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండ నిర్భయంగా వినియోగించుకోవాలని పార్లమెంట్ ఎన్నికల స్వీప్ నోడల్ అధికారి, బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర అన్నారు. నార్సింగి మున్సిపల్ కమిషనర్ అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం స్వయం సహాయక గ్రూపుల మహిళలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వృద్ధులు, దివ్యాంగులకు అవసరమైన సౌకర్యాలను కల్పించడంతో పాటు ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశాన్ని కల్పిస్తున్నామని తెలిపారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలో చదువుకున్న వారు అధికంగా ఉన్నా పోలింగ్ శాతం తగ్గడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. అర్హులందరూ పోలింగ్‌లో పాల్గొని ఓటింగ్ శాతాన్ని పెంచాలని కోరారు.అంతకుముందు రాబోయే ఎన్నికల్లో ఓటు వేస్తామని వారితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌చార్జి నరేశ్, ఏడీఎంసీ ఉమేశ్, టీఎంసీ స్వామి, మహిళలు పాల్గొన్నారు.

కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బుక్క వేణుగోపాల్

అత్తాపూర్: చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, అత్తాపూర్ డివిజన్ ఇన్‌చార్జి బుక్క వేణుగోపాల్ అన్నారు. పార్టీ కార్యాలయంలో అత్తాపూర్‌లో డివిజన్ స్థాయి కార్యవర్గ సమావేశాన్ని డివిజన్ అధ్యక్షుడు విజయ్ కుమార్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ..ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతిఒక్కరూ కష్టపడి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ మల్లేశ్ యాదవ్, కార్పొరేటర్ సంగీతగౌరి శంకర్, కొమురయ్య, సుధాకర్, రాజశేఖర్, కిరణ్ చారి, వెంకటేశ్, జయనంద్‌రెడ్డి, కృష్ణ, డివిజన్ ప్రధాన కార్యదర్శులు రావుల జగన్, సాయి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

శివసాయినగర్ కాలనీలో పేలిన ట్రాన్స్‌ఫార్మర్

బండ్లగూడ: ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది విఫలం అవుతున్నారని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శివసాయినగర్ కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో విద్యుత్ సమస్యలు ఏర్పడడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు చుట్టూ తిరిగితే వారం క్రితం ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఇక తమ సమస్య తీరిందని అంతా భావించారు. కానీ అది కాస్తా బెడిసి కొట్టింది. నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ సోమవారం రాత్రి పేలిపోయి భారీగా మంటలు లేచాయి. దీంతో స్థానికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. మరోవైపు రాత్రంతా కరెంట్ లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేసిన ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



ట్రాన్స్‌ఫార్మర్ నుంచి వస్తున్న మంటలు

సందర్శనలతో ఆవిష్కరణలపై అవగాహన



అక్షయపాత్రను సందర్శించిన సీబీఐటీ విద్యార్థులు, అధ్యాపకులు

మణికొండ: ఇంజినీరింగ్ విద్యార్థులు పరిశ్రమలను సందర్శించడంతో వాటి పనితీరు రాబోయే రోజుల్లో మరింత సమర్థంగా పనిచేసేలా చేపట్టాల్సిన ఆవిష్కరణలపై అవగాహన పెరుగుతుందని చైతన్య భారతీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీవీ నరసింహులు అన్నారు. కాలేజీ మొదటి సంవత్సరం విద్యార్థులు నార్సింగిలోని అక్షయపాత్ర ఫౌండేషన్‌ను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రోగ్రాం మేనేజర్ రాకేశ్‌మిశ్రా అక్షయపాత్రలో ఒకేసారి వేలాది మందికి భోజనం తయారు, సరఫరా చేస్తున్న విధానాలను వివరించారు. ఫౌండేషన్ చరిత్ర, అభివృద్ధి, విద్యార్థులు, రోగులు, రైతులు, ప్రజలకు అందిస్తున్న భోజనాల వివరాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీ ఇన్‌చార్జి డాక్టర్ బి. శ్రీనివాస్‌రెడ్డి, కెమికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎం. ముకుంద వాణి, అధ్యాపకులు మదన్‌మోహన్, డాక్టర్ జీఎస్ఆర్ ప్రసాద్, పీవీ నాగ ప్రపూర్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

దారంతా చీకటే..!



చీకటి సమయంలో ప్రధాన రహదారి

- శ్రీరాంకాలనీ ప్రధానరహదారిపై వెలగని హైమస్ట్ లైట్లు
- అంధకారంలో రోడ్డు
- పట్టించుకోని అధికారులు

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని మధుబన్‌కాలనీ నుంచి శ్రీరామ్‌కాలనీ వెళ్లే ప్రధాన రహదారిపై అంధకారం నెలకొన్నది. రోడ్డుకిరువైపులా ఏర్పాటు చేసిన నాలుగు హైమస్ట్ లైట్లు కొన్ని నెలలుగా వెలగడం లేదు. దీంతో వాహనదారులు, పాదాచారులు ఆ రోడ్డు గుండా వెళ్లాలంటేనే జంకుతున్నారు. చీకటిలో ఎటు నుంచి ఏ వాహనం వచ్చి ఢీ కొడుతుందోనని ఆందోళన చెందుతున్నారు. వారం క్రితం ఓ లారీ చీకట్లో హైమస్ట్ స్తంభాన్ని ఢీకొట్టగా అది ఓ వైపు ఒరిగి ప్రమాదకరంగా మారింది. ఈ విషయమై జీహెచ్ఎంసీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనితోడూ ఆ రహదారి పక్కనే వైన్ షాపు ఉండడంతో మందుబాబులు చీకట్లోనే మద్యం తాగుతున్నారు. పోలీసులు కూడా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఏదైనా సంఘటనలు జరగక ముందే అధికారులు జాగ్రత్త పడితే బాగుంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్లకిరువైపులా ఉన్న హైమస్ట్ లైట్లు వెలిగేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

పట్టించుకునేవారే కరువయ్యారు..



మధుబన్‌కాలనీ నుంచి శ్రీరామ్ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారిపై కొన్ని నెలలుగా హైమస్ట్ లైట్లు వెలగడం లేదు. దీంతో రాత్రి చీకటిమయంగా ఉంటున్నది. ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అలాగే చీకటి ఉండడంతో మందుబాబులు అక్కడే ఉంటున్నారు. దీంతో మహిళలు అటు నుంచి వెళ్లాలంటేనే భయపడుతున్నారు. ఇప్పటికైనా స్పందించి రోడ్లపై లైట్లు వెలిగేలా చూడాలి. – కావటి వెంకటేశ్, మధుబన్ కాలనీ

పవన సుత హనుమాన్ కీ జై!



ఘనంగా హనుమాన్ జయంతి

ఆలయాల్లో భక్తుల ప్రత్యేక పూజలు • కాలనీల్లో శోభాయాత్ర

నియోజకవర్గ ప్రజలు హనుమాన్ జయంతిని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు ఉదయం నుంచే హనుమాన్ ఆలయాలకు వెళ్లి ప్రత్యేక అర్చనలు, తమలపాకు పూజలు, వడ మాలల సమర్పణలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం ఆలయాల వద్ద నిర్వాహకులు అన్నదానాలు చేపట్టారు. అలాగే పలు దేవాలయాల్లో హనుమాన్ చాలీసా పారాయణం, శ్రీరాముడి భజనలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పట్టణంలో హనుమాన్ శోభాయాత్ర మంగళవారం వైభవంగా జరిగింది. జెండా చౌరస్తా నుంచి ప్రారంభం కాగా స్థానిక నేతలు చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, పీసీసీ మాజీ సభ్యుడు కొలను ప్రదీప్‌రెడ్డి తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పట్టణంలోని పాతబస్తీ మీదుగా జాతీయరహదారి గుండా సిద్ధంతి చౌరస్తా మీదుగా సాగింది. – మణికొండ/శంషాబాద్



మైహోం అవతార్ పక్కన సంకట హర హనుమాన్ ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



పూజల్లో పాల్గొన్న మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, బీజేపీ నాయకులు, కౌన్సిలర్లు



మణికొండ హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



శోభాయాత్రలో చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



నార్సింగిలో కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్‌యాదవ్ ..

ఇనార్బిట్‌లో సమ్మర్ సందడి

సాక్షి, సిటీబ్యూరో: వేసవి సెలవుల సీజన్‌ను పురస్కరించుకుని మాదాపూర్‌లోని ఇనార్బిట్ మాల్ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని మాల్ ప్రతినిధులు మంగళవారం తెలిపారు. సీజన్‌కు అనుగుణంగా గార్డెన్ తరహాలో స్ప్రింగ్ డెకర్, పర్యావరణ పరిరక్షణ కోసం టోట్ బ్యాగ్ పెయింటింగ్ వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా సీజన్‌కు అనుగుణంగా స్ప్రింగ్ సమ్మర్ కలెక్షన్‌ను అందిస్తున్నామని వివరించారు. ఈ సీజన్‌లో వారాంతంలో వినోదంతో పాటు వైవిధ్యభరితమైన ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

తరలిన నాయకులు

గచ్చిబౌలి: చేవెళ్ల పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ నామినేషన్ దాఖలు కార్యక్రమానికి శేరిలింగంపల్లి నుంచి భారీ సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. వీరందరికీ ఖాజాగూడలోని ఔటర్‌రింగు రోడ్డు వద్ద ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం కార్పొరేటర్లు రాగం నాగేందర్‌యాదవ్, హమీద్‌పటేల్, సత్యనారాయణ, శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్, సింధుఆదర్శరెడ్డి, రోజాదేవి, మంజుల రఘునాథ్‌రెడ్డి తదితరులు వాహనాల్లో రాజేంద్రనగర్ తహశీల్దార్ కార్యాలయంకు వెళ్లారు. ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ చేవెళ్ల గడ్డపై బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయాన్ని సాధిస్తుందన్నారు.

అత్యాచార కేసు నిందితుడికి జీవిత ఖైదు

లంగర్‌హౌస్: మైనర్ బాలికపై అత్యాచారం చేసిన నిందితుడికి జీవితకాలం జైలు శిక్ష విధించారు. లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ కేసు వివరాలను ఇన్‌స్పెక్టర్ రఘుకుమార్ తెలిపారు. వివరాల్లోకి వెళితే... లంగర్‌హౌస్ హషం నగర్‌లో నివాసముండే అతీఖ్ ఖాన్(23) వృత్తిరీత్యా బైక్ మెకానిక్. 2021లో స్థానికంగా నివాసముండే బాలికపై అత్యాచారం చేశాడు. కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణ చేపట్టిన నాంపల్లి 12వ అదనపు ఎంఎస్‌జె కం స్పెషల్ ఫాస్ట్ ట్రాక్ కోర్టు జడ్జి అనిత మంగళవారం పోక్సో చట్టం కింద తీర్పు ఇచ్చారు. నిందితుడు అతీఖ్‌ఖాన్‌కు జీవిత ఖైదుతోపాటు 5 వేల రూపాయల జరిమానా విధించారు.

గృహిణిపై అత్యాచారానికి యత్నించిన ప్రభుత్వ ఉద్యోగి

జియాగూడ: గుడిసెలో ఒంటరిగా ఉన్న ఓ గృహిణిపై విద్యుత్‌శాఖ ప్రభుత్వ ఉద్యోగి అత్యాచారానికి యత్నించిన సంఘటన కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ బి.రామస్వామి తెలిపిన వివరాల ప్రకారం... పోలీస్‌స్టేషన్ పరిధిలోని కార్వాన్ రాంసింగ్‌పురాలోని గుడిసెలలో ఉంటున్న ఓ గృహిణి (24)పై మధ్యాహ్నం కార్వాన్ విద్యుత్ కార్యాలయానికి చెందిన ఉద్యోగి రాజారావు అత్యాచారానికి యత్నించాడు. అదే సమయంలో గుడిసెకు వచ్చిన భర్త శేఖర్ వెంటనే గమనించి అతడిని పట్టుకుని కొట్టడానికి యత్నించగా పారిపోయాడు. దీంతో ఆ దంపతులు కుల్సుంపురా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

నర్సరీ నుంచే ఆంగ్ల బోధన



తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

మణికొండ: వచ్చే విద్యా సంవత్సరం నుంచి నర్సరీ నుంచే ఇంగ్లిష్ మీడియంలోనే బోధించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని మణికొండ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాంగ్యానాయక్ అన్నారు. పాఠశాలలో తల్లిదండ్రులతో మంగళవారం సమావేశం నిర్వహించి విద్యార్థులకు ప్రోగ్రెస్ రిపోర్టులు అందజేశారు. రెండేళ్లుగా టీచ్ ఫర్ ఇండియా (టీఎఫ్ఐ) స్వచ్ఛంద సంస్థ ద్వారా పనిచేసిన ముగ్గురు ఉపాధ్యాయుల పదవి కాలం పూర్తి కావడంతో వారిని సత్కరించి వీడ్కోలు పలికారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల సౌకర్యాలను విద్యార్థులకు కల్పిస్తున్నామన్నారు. ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం , యూనిఫారాలు అందిస్తున్నామని తెలిపారు. రాబోయే విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు జరుగుతున్నాయని, తమ పిల్లలను చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కె. రామకృష్ణారెడ్డి, జిల్లా స్కూల్ అధికారి నజీర్, ఉపాధ్యాయులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను వినియోగించొద్దు

మణికొండ: ప్రజలు, వ్యాపార సంస్థల వారు నిషేధిత ప్లాస్టిక్ కవర్లను వినియోగించవద్దని నార్సింగి మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఆయనతో పాటు మరో రెండు బృందాలు మంగళవారం షాపుల్లో తనిఖీలు నిర్వహించి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణం, జంతుజాలానికి పెద్ద సమస్యగా మారుతుందన్నారు. ప్లాస్టిక్ భూమిలో కరిగేందుకు వందల సంవత్సరాలు పడుతుందని, దాంతో భూసారం తగ్గిపోవడం, మనం తినే ఆహారంలో అది కలిసి అనేక రోగాలకు దారి తీస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 13 షాపులకు రూ. 2500 జరిమానా విధించడంతో పాటు 25 కేజీల ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో కాలుష్య నియంత్రణ అధికారి బి. సురేశ్, సహాయ పర్యావరణ సైంటిస్ట్ బి. రాము, మున్సిపల్ సిబ్బంది పి.గణేశ్, శ్యాంగౌడ్, వంశీ, జనార్దన్‌రెడ్డి, మహిపాల్, రవి, శ్రీనివాస్, రంజాన్‌పాషా పాల్గొన్నారు.



ప్లాస్టిక్ కవర్లను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది

ప్రతి ఒక్కరూ విధిగా ఓటు వేయాలి

శేరిలింగంపల్లి సెగ్మెంట్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, జెడ్సీ స్నేహశబరీష్



జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో కాలనీల్లో అవగాహన కల్పిస్తున్న ఉద్యోగులు

గచ్చిబౌలి: ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ విధిగా ఓటు వేసేలా చూడాలని శేరిలింగంపల్లి సెగ్మెంట్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్ సూచించారు. మంగళవారం శేరిలింగంపల్లి సెగ్మెంట్‌లోని ఎన్నికల అధికారులు, ఉద్యోగులు, సిబ్బందితో ఆమె సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలింగ్ నేపథ్యంలో 200 బాక్సులు స్టేషనరీ , ఓటర్ల సమాచార స్లిప్పులు, ఇతర సామాగ్రి అందుబాటులోకి వచ్చాయన్నారు. బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలలో ఓటు వేయడానికి వచ్చిన వారికి ఎలాంటి సమస్యలు రాకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం అధికారులు, ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు

ఓటర్లకు అవగాహన కార్యక్రమాలు

పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరుతూ పలు కాలనీలు, బస్తీలలో అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని జోనల్ కమిషనర్ తెలిపారు.ఎస్వీఈఈపీ కార్యక్రమంలో భాగంగా శేరిలింగంపల్లిలోని దీప్తిశ్రీనగర్ గేటెడ్ కమ్యూనిటీలు, ఆర్‌డబ్ల్యూఏ జేపీనగర్ వంటి ప్రాంతాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

25 నుంచి ఓటరు స్లిప్‌ల పంపిణీ

ఈ నెల 25 నుంచి ఓటర్ స్లిప్‌లను పంపిణీ చేయాలని చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం ఏఆర్ఓ, వెస్ట్ జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కార్యాలయంలో ఎన్నికల ఏర్పాట్లపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 25 నుంచి మే 8వ తేదీ వరకు ఓటరు స్లిప్‌ల పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో బూత్ లెవల్ ఆఫీసర్లు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆమె సూచించారు.

సకాలంలో పన్నులు చెల్లించాలి



సీబీఐటీ కాలేజీ ఆస్తి పన్ను చెక్కును తీసుకుంటున్న కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

మణికొండ: ఆస్తి పన్నును సకాలంలో చెల్లిస్తేనే అన్ని రకాల ప్రగతితో పాటు ప్రజా సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని నార్సింగి మున్సిపల్ కమిషనర్ టి. ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని చైతన్య భారతీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) కళాశాల నుంచి 5 శాతం రాయితీతో రూ. 17,04,984ల వార్షిక పన్నును మంగళవారం వసూలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో ఈనెల 30వ తేదీలోపు పన్ను చెల్లించే వారికి 5 శాతం రాయితీ లభిస్తుందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీబీఐటీ సిబ్బంది, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆదరించండి

మియాపూర్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆదరించాలని డివిజన్ అధ్యక్షుడు ప్రవీణ్ రెడ్డి ఓటర్లను కోరారు. అత్తాపూర్ డివిజన్‌లో చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్ రెడ్డి మద్దతుగా నందిముసలైగూడ, సాయినగర్, మారుతీనగర్‌లో రంజిత్ రెడ్డి తనయుడు ఆర్యన్ రెడ్డితో కలిసి మంగళవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ, బీఆర్ఎస్ మోసపూరిత మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఆరు గ్యారంటీ పథకాలను పక్కగా అమలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మిద్దెల సురేందర్ రెడ్డి, సురేశ్‌రెడ్డి, గూడెం శ్రీకాంత్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, పీఎంరెడ్డి, మహేందర్‌రెడ్డి, అర్జున్ రెడ్డి, కపిల్, రవి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్‌లోని ఖాజాగూడ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. హాజరైన 20 మంది విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులను సూపర్‌వైజర్ జ్యోతి శ్రీ, అంగన్‌వాడీ టీచర్ జ్యోతి అందించారు. చిన్నారులంతా ఒకే తరహా డ్రెస్‌లు ధరించడంతో తల్లిదండ్రులు వారిని చూసి మురిసిపోయారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

గచ్చిబౌలి: వాతావరణ సమతుల్యం దెబ్బతింటోందని, పరిరక్షించాల్సిన అవసరం ఉందని సంస్కృతి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ మంగళారపు లక్ష్మణ్ పేర్కొన్నారు. నీరు, విద్యుత్‌ను పొదుపుగా వాడాలని, ప్లాస్టిక్‌ను నిషేధించాలనే అంశాలపై విద్యార్థులతో మంగళవారం అవగాహన ర్యాలీని నిర్వహించారు. విద్యార్థులు ప్లకార్డులు చేతబట్టి కొండాపూర్, రాఘవేంద్ర కాలనీ, రాజరాజేశ్వరి కాలనీ, హఫీజ్‌పేట్ కాలనీలలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాతావరణంలో అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటున్నాయని థర్మల్ పవర్, కార్బోహైడ్రేట్స్, ఏసీలు, ఓవెన్లు, రిఫ్రిజిరేటర్ల వాడకం అధికం కావడంతో వాతావరణ సమతుల్యత దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. భూమిలో మట్టి పరిమళాలు లేవని ఒకప్పుడు వర్షం పడితే భూమి నుంచి కమ్మని వాసన వచ్చేదని కానీ నేడు ఎరువులు, క్రిమి సంహారక మందుల వాసన వస్తోందన్నారు. కార్య క్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ జ్యోతిర్మయి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుకకు ఓటు వేయండి

గోల్కొండ: పార్లమెంట్‌లోగానీ, అసెంబ్లీలోగానీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టే పార్టీ మజ్లిస్ ఒక్కటే అని, దానికే ఓటు వేయాలని ఆ పార్టీ శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. మంగళవారం గోల్కొండ బడాబజార్‌లో జరిగిన ఎన్నికల సభలో ఆయన మాట్లాడారు. మైనార్టీలు, దళితులపై దేశంలో ఎక్కడ దాడులు జరిగినా తమ పార్టీ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పార్లమెంటులో నిలదీస్తారని అన్నారు. మజ్లిస్ కేవలం ముస్లిం, మైనార్టీల పక్షాన ఉండదని, దళితులు, అణగారిన వర్గాలు, బీసీల హక్కుల సాధనకు అండగా ఉంటుందన్నారు. హైదరాబాద్ ప్రజలు తమను ఓటు వేసి గెలిపిస్తున్నారంటే తమ పనివిధానం ప్రజలు మెచ్చుకుంటున్నారని పేర్కొన్నారు. మజ్లిస్ పార్టీ అధ్యక్షుడుగా హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న అసదుద్దీన్ ఒవైసీ చేయించిన అభివృద్ధి పనులు మజ్లిస్ వ్యతిరేకులకు కానరావడం లేదని ఎద్దేవా చేశారు. కార్వాన్ నియోజకవర్గంలో ప్రభుత్వ బాలికల జూనియర్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలు మజ్లిస్ పార్టీ కృషి వల్లే స్థాపించినట్లు చెప్పారు. నగరానికి దళిత మేయర్‌ను అందించిన ఘనత తమ పార్టీదేనన్నారు. కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్, కార్పొరేటర్ నసీరుద్దీన్, నాయకుల హారూన్ ఫరాన్, ఏకే పఠాన్ తదితరులున్నారు.

మజ్లిస్ ఇంటింటి ప్రచారం

గోల్కొండ: మజ్లిస్ సెక్యూలర్ పార్టీ అని, అది అభివృద్ధి పనులకే పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన రేశంబాగ్, అటారాసిటీ, ఫ్రెన్ కాటేజీ, గోల్కొండ కోట మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో మజ్లిస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మజ్లిస్ పార్టీ చేసిన అభివృద్ధి పనుల గురించి వివరిస్తూ కరపత్రాలు పంచిపెట్టారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గోల్కొండలో ఎటువంటి సమస్యలు లేవని అన్నారు. తాగునీటి కొరతలేదని, ప్రధానరోడ్లతోపాటు అంతర్గత రోడ్లు సైతం అభివృద్ధి చేయించానని చెప్పారు. హైదరాబాద్ లోక్‌సభ మజ్లిస్ పార్టీ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీ ఎంపీ లాడ్ నిధులతో కార్వాన్ అసెంబ్లీ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందాయని, కొత్త కాలేజీలను స్థాపించామని చెప్పారు. నియోజకవర్గంలో నీటి ఎద్దడిని తీర్చడానికి ఓవర్‌హెడ్ ట్యాంకర్లు సైతం ఎంపీ నిధులతో నిర్మించినట్లు వివరించారు. ఆయన వెంట మజ్లిస్ ఏరియా కమిటీ ప్రతినిధులు అజీజ్ ఖాన్ పఠాన్, సయ్యద్ ఆజామ్, ఎంఏ రహీం, షబ్బీర్‌ఖాన్, మహ్మద్ ముజీబ్ తదితరులున్నారు.

జూ... జామ్!



పచ్చికబయళ్లలో ఉల్లాసంగా గడుపుతున్న చిన్నారులు

చార్మినార్: ఆహ్లాదకర వాతావరణం.. ఆకట్టుకుంటున్న పచ్చికబయళ్లు.. ఉదయం, సాయంత్ర వేళల్లో చల్లటి గాలులు.. కేరింతలు.. ఉల్లాసం.. ఉత్సాహం... చెట్ల కింద సహపంక్తి భోజనాలు.. ఇదీ నెహ్రూ జూపార్కులోని సోమవారం కనిపించిన దృశ్యాలు. మండే ఎండల నుంచి ఉపశమనం పొందడమేకాకుండా రకరకాల జంతువులు, పక్షులు, ఇతర జీవాలను చూసి ముచ్చటపడుతున్నారు. ప్రస్తుతం విద్యార్థులకు వేసవి సెలవులు కావడంతో జూ పార్కుకు సందర్శకుల తాకిడి పెరిగింది.